

లక్ష్మారెడ్డిపాలెం సూర్యవంశీకాలనీ వద్ద కాల్వలో పేరుకుపోయిన చెత్తను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం. పక్కన డీఈ సుమంత్

అక్రమంగా డ్రైనేజీ లైన్ కలిపితే చర్యలు

● డీఈ సుమంత్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డిపాలెం వద్ద విజయవాడ జాతీయ రహదారిపైకి మురుగునీరు రాకుండా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. 'జాతీయ రహదారిపై మురుగు ప్రవాహం' అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధికారులు స్పందించారు. గురువారం ఉదయం కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈఈ సుమంత్ సిబ్బందితో అక్కడికి చేరుకుని డ్రైనేజీ పైప్‌లైన్‌ను క్లీన్ చేయించారు. అదేవిధంగా మురుగు కాల్వలో పేరుకుపోయిన మట్టి, బురదను జేసీబీతో తొలగించారు. సూర్యవంశీ కాలనీ సమీపంలోని ధరణి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన డ్రైనేజీ లైన్‌ను ఎలాంటి సమాచారం ఇవ్వకపోగా, అక్రమంగా మున్సిపల్ డ్రైన్‌లో కలుపడంతో ఇబ్బంది ఏర్పడిందని డీఈ తెలిపారు. అపార్ట్‌మెంట్ డ్రైన్ లైన్‌ను మూసివేసినట్లు డీఈ తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎలాంటి చర్యలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



ట్రంక్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ట్రంక్‌లైన్ పనులతో వరదనీటి సమస్యకు విముక్తి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా వరదనీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న పలు కాలనీవాసులకు ట్రంక్‌లైన్ పనులతో విముక్తి కల్పించనున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని స్వాతి రెసిడెన్సీ వద్ద ఇటీవల చేపట్టిన ట్రంక్‌లైన్ పనులు నిలిచిపోవడంతో పరిసర కాలనీవాసులతో కలిసి గురువారం ఆ పనులను ఎమ్మెల్యే పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రంక్‌లైన్ పక్కన ఉన్న ప్రైవేటు స్థలంలోంచి వెళ్లాల్సి ఉండగా ఆ స్థల యజమానిని ఒప్పించగా సానుకూలంగా స్పందించడంతో పనులు ప్రారంభించామన్నారు. ఎన్నో అడ్డంకులు దాటుకుని నిర్మిస్తున్న ఈ పనుల్లో అధికారులు నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ వరద సమస్యకు శాశ్వత పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోచబోయిన జగదీష్ యాదవ్, చంద్రారెడ్డి, నర్సింగ్‌గౌడ్, అనిల్‌కుమార్, నాగార్జున రెడ్డి, వాటర్ వర్క్స్ అధికారులు రాజు, బిల్డర్ జగన్‌మోహన్‌రెడ్డి, పరిసర కాలనీల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.



అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన గణేష్‌నేతను సన్మానిస్తున్న మురళి తదితరులు

పద్మశాలీలు రాజకీయంగా ఎదగడమే లక్ష్యమవ్వాలి

● తెలంగాణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి

మన్సూరాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు అన్ని రంగాలతో పాటు ప్రధానంగా రాజకీయ రంగంలోనూ ఎదగడమే లక్ష్యమవ్వాలని తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని స్పందన పాలాది పరమేశ్వర్ వృద్ధాశ్రమంలో గురువారం ఎల్బీనగర్ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా రెండోసారి పున్న గణేష్‌నేత, కార్యవర్గ సభ్యులుగా పలువురు ప్రమాణస్వీకారం చేయగా వారిని కమర్తపు మురళి అభినందించి పద్మశాలీల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. పున్న గణేష్‌నేత మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పద్మశాలీలకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తూ.. సంఘం పరంగా సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పద్మశాలీల ఐక్యతకు పాటుపడతామన్నారు. కార్యక్రమంలో భావనారుషి సహకార గృహనిర్మాణ సంఘం చైర్మన్ సీత ఆంజనేయులు పాల్గొన్నారు.

డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు

చంపాపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చంపాపేట డివిజన్‌లోని న్యూపద్మానగర్‌కాలనీలో గురువారం కార్పొరేటర్ పర్యటించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో స్టార్మ్ వాటర్ డ్రైన్‌తో పాటు ఇంటర్నల్ సీసీ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ఎగువ ప్రాంతాలైన కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్, క్రాంతినగర్‌కాలనీ, రాఘవేంద్రనగర్‌కాలనీ, కేకే ఎన్‌క్లేవ్, సామ సరస్వతీకాలనీ నుంచి వచ్చే వర్షపు నీటితో దిగువ ప్రాంతాలైన న్యూపద్మానగర్‌కాలనీలోని రోడ్ నెం.2,3,4లో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా శాశ్వత పరిష్కారం దిశగా స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణం చేపడుతున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఈఈ కార్తీక్, ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాలనీ ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, వెంకట్, కిషన్‌రావు, భూపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.



న్యూ పద్మానగర్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

పేదలందరికీ సన్నబియ్యంతో ఒకే రకమైన భోజనం

చంపాపేట , ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ధనిక, పేద తేడా లేకుండా పేదలందరికీ సన్న బియ్యంతో ఒకే రకమైన భోజనం అందిస్తున్నట్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని భూపేష్‌గుప్తానగర్‌కాలనీలో లలిత గృహంలో గురువారం రేషన్ దుకాణం ద్వారా సరఫరా అయిన సన్న బియ్యంతో వండిన భోజనాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కార్పొరేటర్ భుజించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలందరు ఒకే రకమైన భోజనం చేయాలనే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజుగౌడ్, మమతా మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



భూపేష్‌గుప్తానగర్ కాలనీలో లలిత ఇంట్లో భోజనం చేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్ తదితరులు

పాలకవర్గం ముగిసింది..

అభివృద్ధి ఆగింది!

- మూడు నెలలుగా అభివృద్ధి పనులకు నో టెండర్స్
- గత పాలకవర్గం చేసిన తీర్మానాలను పట్టించుకోని అధికారులు
- అసంపూర్తి పనులతో కాలనీవాసుల ఇబ్బందులు
- పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో ఈ దుస్థితి

పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం(ఫైల్)



అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారుల పాలనలో అభివృద్ధి అందని ద్రాక్షలా మారింది. అభివృద్ధి పనుల కోసం అధికారుల చుట్టూ తిరిగి బతిమిలాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అయినా పనులకు మోక్షం లభించడం లేదు. ఇది నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో పరిస్థితి. ఇక్కడ జనవరి 27తో పాలకవర్గం పదవి కాలం ముగిసింది. దీంతో ప్రభుత్వం మున్సిపాలిటీకి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. పాలకవర్గం పదవి కాలంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు తప్ప.. ప్రత్యేక అధికారుల పాలన అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎలాంటి పనులకు స్వీకారం చుట్టలేదు. దీంతో మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులే దీనికి నిదర్శనం.

మూడు నెలలుగా నో టెండర్స్..

మున్సిపాలిటీ పాలకవర్గం పదవి కాలం ముగిసి దాదాపు 3 నెలలు కావస్తుంది. పాలకవర్గం గడువుకు ముందే సుమారు రూ.12కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం చేసి ఆమోదం తెలిపింది. అప్పటికే కొన్ని పనులు కొనసాగుతుండగా మరిన్ని అదనపు పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పాలకవర్గం ఉన్నప్పుడు చేపట్టిన పనులు పూర్తి కాగా.. అనంతరం కౌన్సిల్ ఆమోదం పొందిన పనులకు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. మూడు నెలల నుంచి కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టకపోగా గత కౌన్సిల్ ఆమోదం పొందిన పనులకు సైతం అధికారులు టెండర్లను పిలవడం లేదు. దీంతో గత పాలకవర్గం తీర్మానం చేసిన పనులను సైతం అధికారులు పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో కూడా తీవ్ర జాప్యం చేస్తున్నట్లు సమాచారం. ప్రత్యేక పాలనలో ప్రజలతో పాటు కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.



పెద్దఅంబర్‌పేట్ హనుమాన్‌నగర్ కాలనీలో మధ్యలోనే నిలిచిపోయిన యూజీడీ పైప్‌లైన్ పనులు

అసంపూర్తిగా నిలిచిన పనులు..

పాలకవర్గం ఉన్నప్పుడు చకాచకా జరిగిన అభివృద్ధి పనులు ప్రస్తుతం ఎక్కడికక్కడ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అసంపూర్తిగా మిగిలిన పనులు దర్శనమిస్తున్నాయి. సగం సగం చేసిన పనులతో ఆయా వార్డుల్లో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని రోడ్లపై వాహనాలతో పాటు కనీసం నడవలేని పరిస్థితులు నెలకొన్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గం చేసిన తీర్మానాలకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తే తప్ప అసంపూర్తి పనులు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. కౌన్సిల్ ఆమోదం పొందిన పనులకు వెంటనే టెండర్లను పిలిచి పనులు ప్రారంభించాలని పట్టణ ప్రజలు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. కౌన్సిల్ ఆమోదం పొందిన పనులకు టెండర్లు పిలవకపోవడం వెనుక మతలబు ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రీకాల్ టెండర్ల విషయంలో కూడా మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తీర్మానం పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు..?



పాలకవర్గం చివరి సమావేశంలో పెద్ద ఎత్తున వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మానం చేసి ఆమోదం తెలిపింది. మరో వారం రోజుల్లో పాలకవర్గం గడువు ముగియనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అందులో ఎక్కువగా కౌన్సిల్ తీర్మానం చేసిన పనులు ఉండడం విశేషం. మూడు నెలలుగా పనులకు టెండర్లను పిలవకపోవడంతో పలు వార్డుల్లో శిలాఫలకాలు దర్శనమిస్తున్నాయి. అభివృద్ధి పనుల విషయంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి చొరవ తీసుకుని వెంటనే టెండర్లను ఆహ్వానించి పనులను ప్రారంభించాలని పట్టణ ప్రజలతో పాటు తాజా మాజీ కౌన్సిలర్లు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి



అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. నిధుల నిల్వను బట్టి పనులు చేపడుతున్నాం. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అవసరం అయితే టెండర్లు పిలిచి పనులు చేస్తాం.

- రవీందర్‌రెడ్డి, కమిషనర్ పెద్దఅంబర్‌పేట్

ఇంటి పన్నుల భారం తగ్గించండి

● జిల్లా కలెక్టర్‌కు మీర్‌పేట్ కాలనీల సమాఖ్య వినతి

సరూర్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు భారంగా మారిన ఇంటి పన్నులను తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని మీర్‌పేట్ కాలనీస్ అసోసియేషన్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరింది. ఈ మేరకు గురువారం ఫెడరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీర్‌పేట్‌లో జీహెచ్ఎంసీ పరిధిలో కన్నా పన్నులు అధికంగా ఉన్నాయని, ఈ విషయాన్ని సీఎడీఎంఏతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పన్నుల తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు అక్రమంగా నీటి వ్యాపారం నిర్వహిస్తున్నారని, దాంతో భూగర్భ జలాలు అడగంటి పోయే ప్రమాదం ఉన్నదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నీటి వ్యాపారాన్ని అరికట్టేలా బాలాపూర్, సరూర్‌నగర్ తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆయా అంశాలపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు పద్మాచారి, శ్రీధర్‌గౌడ్, శ్రావణ్, శివకుమార్, శివనాగేంద్ర పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు



కాలనీవాసులతో చర్చిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం

డ్రైనేజీ పనులు చేపడుతాం

వనస్థలిపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు అతి త్వరలోనే పరిష్కారం అవుతాయని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీల డ్రైనేజీ పనులను త్వరలోనే ప్రారంభించనున్న నేపథ్యంలో కార్పొరేటర్ గురువారం జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం రాజ్‌గోపాల్ ఇతర అధికారులతో కలిసి చేపట్టబోయే పనుల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అతి త్వరలోనే భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించి కాలనీవాసులకు డ్రైనేజీ సమస్యలతో విముక్తి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదవండి

మన్సూరాబాద్ : విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి తల్లిదండ్రులు, గురువులతో పాటు తమ ప్రాంతాలకు మంచిపేరు తీసుకురావాలని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్‌లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వార్షికోత్సవాలు గురువారం కాత్యాయని గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పాల్గొని పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. నాగోల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, చంద్రశేఖర్‌ఆజాద్, సత్యనారాయణ, కన్నాగౌడ్, చిరంజీవి, రవికుమార్ పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో 'జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్'

● బస్తీల్లో కాంగ్రెస్ నేతల పాదయాత్ర

సరూర్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చేపట్టిన జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 24వ, 25వ డివిజన్ల పరిధిలోని బస్తీల్లో కాంగ్రెస్ నేతలు పర్యటించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి తదితరులు పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం గాంధీజీ, అంబేడ్కర్‌తో పాటు భారత రాజ్యాంగాన్ని సైతం అగౌరవపరుస్తూ అనాగరికంగా వ్యవహరిస్తున్నదని వారు ఆరోపించారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ఆదరించాలని వారు కోరారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవారు మల్లారెడ్డి, పర్వతి రవికాంత్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, బొల్లపల్లి కుమార్, సూర్లగంటి విజయ్, రమేశ్‌గౌడ్, తిరుమల్, రాముగౌడ్, భాస్కర్, గిరిముదిరాజ్ పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న టీపీసీసీ నేతలు పారిజాతారెడ్డి, అమరేందర్‌రెడ్డి తదితరులు

అవగాహనతోనే అగ్నిప్రమాదాలను నివారించొచ్చు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ప్రాథమిక దశలోనే ఎలా నివారించవచ్చనే అవగాహన ప్రతి ఒక్కరికి అవసరమని మలక్‌పేట ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ సారెడ్డి అంజిరెడ్డి అన్నారు. గురువారం అగ్నిప్రమాదాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆస్మాన్‌ఘడ్‌లోని అపార్ట్‌మెంట్‌లో, మలక్‌పేట యశోద ఆస్పత్రిలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఏదేని పరికరానికి గాని గదిలో గాని అగ్నిప్రమాదం జరిగిన వెంటనే నివారించే పరికరాలను ఎలా ఉపయోగించాలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మంటలను అప్పటికప్పుడు అదుపు చేసేందుకు పరికరాలను వాడే తీరుపై అగ్నిమాపక సిబ్బంది ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండడంతో పాటు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే 1014కు సమాచారం అందించాలని అంజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా భద్రత, ప్రాథమిక చికిత్సకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు.



అగ్నిప్రమాద మంటలను అదుపు చేసే తీరును వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు అగ్నిమాపక పరికరాలను వాడే తీరును అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



ప్రమాణస్వీకారం చేస్తున్న రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ కార్యవర్గం

బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన నూతన కార్యవర్గం గురువారం బార్ అసోసియేషన్ హాల్‌లో ప్రమాణస్వీకారం చేసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్. ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొమ్మూరి గాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాసెట్టి కార్తీక్, లైబ్రరీ సెక్రటరీగా జక్కుల వెంకటయ్య, కోశాధికారిగా కరణం ప్రశాంత్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీగా అంతటి స్వామి, మహిళా ప్రతినిధిగా పలుసం అనసూయ, కార్యవర్గసభ్యులుగా ధరావత్ జ్యోతి, నూనె భాగ్య, మండలాపురం సునిత, బి. సుఖేందర్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ, బోరంపేట చంద్రశేఖర్, బన్నె మల్లేష్‌లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాంరెడ్డి, రేసు మహేందర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు మధుసూదన్‌రావు, బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ధీకొండ రవీందర్, సహాయ ఎన్నికల అధికారులు లక్ష్మణ్, నర్సింగ్‌రావు, మాజీ అధ్యక్షులు శ్రీనాథ్, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీ అయిన జడ్జిలకు వీడ్కోలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులలోని వివిధ కోర్టుల్లో పనిచేస్తూ బదిలీ అయిన పలువురు జడ్జిలకు బార్ అసోసియేషన్ ఘనంగా వీడ్కోలు పలికింది. గురువారం కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన వీడ్కోలు సమావేశంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి డాక్టర్ పట్టాభిరామారావు, 2వ ఏడీజే జడ్జి రత్నప్రభావతి, 4వ ఏడీజే కవిత, ఫ్యామిలీకోర్టు జడ్జి ముక్తిద, 9వ ఏడీజే జడ్జి హరీష, 11వ ఏడీజే జడ్జి జయప్రసాద్‌లకు బార్ అసోసియేషన్ కార్యవర్గంతో పాటు సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కోర్టుల్లో న్యాయవాదులంతా సంపూర్ణ సహకారాలు అందించారన్నారు. న్యాయవాదులందరికీ వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కొమ్మూరి గాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాసెట్టి కార్తీక్, సీనియర్ న్యాయవాదులు రాంరెడ్డి, రేసు మహేందర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు మధుసూదన్‌రావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు శ్రీనాథ్, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ధీకొండ రవీందర్, లక్ష్మణ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ అక్రమ కేసులు బనాయించినందుకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈడీ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాకు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో పలుచనైపోతున్నామన్న ఆందోళనలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుధోరణిని అవలంబిస్తున్నదని ఆరోపించారు. అందులో భాగంగానే కాంగ్రెస్ అగ్రనేతలైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ అక్రమ కేసులు బనాయించారన్నారు. అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, ధన్‌రాజ్‌గౌడ్, గుల్షన్ అహ్మద్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నర్సింహ, శేఖర్‌ముదిరాజ్, శ్రీశైలం, కళ్యాణ్‌యాదవ్ పాల్గొన్నారు.



ధర్నాకు తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఘనంగా వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాలు

హయత్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పార్టీ కార్యకర్తలతో కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను ఊడ్చి శుభ్రం చేసి చెత్తను తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా విద్యార్థుల ఉసురు తీస్తున్నారని ఆరోపించారు. పాఠశాల ఆవరణలు ఎక్కడ చూసిన చెత్తతో నిండి దుర్గంధవాసన వస్తుందన్నారు. దీంతో విపరీతంగా దోమలు వృద్ధి చెంది విద్యార్థులు దోమకాటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



చలోబస్తీలో భాగంగా కాలనీలు శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌లో 'చలో బస్తీ'

మన్సూరాబాద్ : వాజ్‌పేయ్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో 'చలో బస్తీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి విచ్చేసి పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా మన్సూరాబాద్ గాలిపోచమ్మ ఆలయం శుభ్రం చేయడం, డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల పునరుద్ధరణ, ప్రభుత్వాస్పత్రిలో స్వచ్ఛభారత్, దళితవాడలోని మహిళ కుటుంబాన్ని సన్మానించి వారి ఇంట్లో భోజనం చేయడంతో పాటు బైక్ ర్యాలీతో బీజేపీ జెండా ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంద్రసేనారెడ్డినగర్ కాలనీలో..

చంపాపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఇంద్రసేనారెడ్డినగర్‌కాలనీలో గురువారం వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో యాక్టివ్ మెంబర్స్‌తో కలిసి గావ్ చలోబస్తీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులను సన్మానించి పలు దేవాలయాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, చౌకధర దుకాణంను సందర్శించారు. రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని సామ రంగారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్రప్రసాద్, నరేష్‌యాదవ్, రాజుగౌడ్, శశిధర్‌రెడ్డి, సోమిరెడ్డి, మునీల్‌నాయక్, లాల్‌నాయక్, బుగ్గరాములు, రాజవర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, చంద్రకాంత్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.



హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి